క్లుప్తంగా

వైభవంగా తిరు కల్యాణ మహోత్సవాలు



లూటుకుర్రులోని స్వామివారు

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రెండోరోజు బుధవారం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, పుష్పకవచాలంకరణలో స్వామివారి దివ్య సందర్శన నిత్య హోమాది కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు.

జగన్మోహినీ కేశవస్వామికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: మండల పరిధిలోని పురాణ ప్రసిది చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం విశేష పూజలు, అర్చనలు, వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ భాగవతులు వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, అర్చన, తులసిపూజ, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి కరప విఘ్నేశ్వర కళాకారుల బృందం వారిచే మైరావణ చరిత్ర తోలుబొమ్మలాట ప్రదర్శించారు.

రైతుల సంక్షేమానికే మొదటి ప్రాధాన్యం

పి.గన్నవరం: రైతుల సమస్యలే ప్రధాన అజెండాగా, వారి సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం ఇరిగేషన్ కార్యాలయంలో బుధవారం నీటి పారుదల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి కొరత, కాలువల పరిస్థితి, పంపు సెట్ల పనితీరు తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లతో ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం జరిగిన సమావేశంలో పి.గన్నవరం, అంబాజీపేట, మామిడికుదురు మండలా లకు చెందిన 13 మంది లబ్ధిదారులకు రూ.25.54 లక్షల విలువైన యంత్ర పరికరాలు అందించారు. రూ.11.14 లక్షలు సబ్సిడీతో వీటిని అందించామన్నారు. ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలి

అంబాజీపేట: పోషక విలువలుకలిగిన ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల గర్భిణులకు తగిన పోషకాలు అందుతాయని వైద్యులు కె.ఎన్.శ్రీనివాసరావు, సూర్యనగేష్ అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్‌గా లభించే పండ్లు, ఆకు కూరలను తరచూ తీసుకోవాలని సూచించారు. నందంపూడిలో సీహెచ్ఓ బి.అప్పారావు ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వడ గాల్పులపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భూలక్ష్మి, హెచ్‌వీ శాంతకుమారి, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్ – ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా) నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. మండపేటకు చెందిన నారాయణరెడ్డి పీవీఆర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, రాజమహేంద్రవరానికి చెందిన భానుతేజస్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, రేవతి ఆస్పత్రి, డాక్టర్ మోహన్ డయాబెటిస్ ఆస్పత్రి, గౌతమీ నేత్రాలయం, రమా దంత వైద్యశాల, కొత్తపేట భాస్కర ఆస్పత్రి చిల్డ్రన్స్ విభాగం, అమృత చర్మవ్యాధుల ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు.

వృద్ధ దంపతులకు సాయం



అంతర్వేదిలో వృద్ధులకు సాయం చేస్తున్న జాన్‌బాబు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామ శివారు రామ్‌బాగ్ కాలనీకి చెందిన వృద్ధ దంపతులకు కువైట్ కేంద్రంగా ఉన్న ఆదర్శ ఆంధ్రా యూత్ బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దేవస్థానం సర్పంచ్ కొండా జాన్‌బాబు చేతుల మీదుగా వృద్ధుడు యడ్ల సమూయేలు, శాంత సుగుణలకు ఆ మొత్తాన్ని అందించారు. సదరు సంస్థ వ్యవస్థాపకులు మోకా స్వామి, ఇంజేటి కృష్ణకుమార్ వాటిని సమకూర్చారు. నక్కా రామారావు, తాడి సహదేవ్, చొప్పల నరసింహాస్వామి, బుంగ విజయ్ మోహన్, నక్కా రత్నం, గోనమండ సుధాకర్ పాల్గొన్నారు.

వారు టిక్ పెట్టిన వారే అర్హులు

- కూటమి నేతల కుటుంబీకులకే సబ్సిడీ రుణాలు
- నామమాత్రంగా ఇంటర్వ్యూలు



మామిడికుదురులో ఇంటర్వ్యూలకు భారీగా హాజరైన దరఖాస్తుదారులు

మామిడికుదురు: కాపు, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై అందించే రుణాలకు లబ్ధిదారుల ఎంపిక అంతా ఒక ప్రహసనంగా మారిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మండలానికి కేటాయించిన యూనిట్లు అరకొరగా ఉండగా వీటి కోసం దరఖాస్తు చేసిన వారి సంఖ్య వేలలో ఉందని చెబుతున్నారు. గ్రామానికి మూడు లేదా నాలుగు తప్పితే అయిదో వ్యక్తికి ఎక్కడో కాని రుణం మంజూరు చేయలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు మొక్కుబడిగా ఇంటర్వ్యూలు నిర్వహించారన్నది నగ్న సత్యమని చెబుతున్నారు. రుణం మంజూరు చేయాలంటే కూటమి పార్టీ నేతలను ప్రసన్నం చేసుకోవాలని పెదవి విరుస్తున్నారు. కూటమి నేతల్లో పెద్దలు తమ కుటుంబ సభ్యులకే టిక్ పెడుతున్నారన్న విమర్శలు ఆ పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని మంజూరైన యూనిట్లు, దరఖాస్తుదారుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

రెండు నియోజకవర్గాల్లో 10,265 దరఖాస్తులు

పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సబ్సిడీ రుణాలకు 10,265 మంది ధరఖాస్తు చేశారు. వీరి నుంచి మొత్తం 635 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. వీరిలో బీసీ కార్పొరేషన్ ద్వారా 349 మందిని, కాపు కార్పొరేషన్ ద్వారా 256 మందిని, ఈడబ్ల్యూఎస్ ద్వారా 23 మందితో పాటు ఏడు జనరిక్ మెడికల్ షాపు యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు జరిగాయి. వీటికి భారీగా దరఖాస్తుదారులు తరలివచ్చారు. ఎందుకు వచ్చామో అర్థం కాని పరిస్థితి లబ్ధిదారులు ఉన్నారు. నిజమైన అర్హులకు ఎటువంటి రుణం ఇచ్చే పరిస్థితి లేదు. కూటమి నేతలకే ఆ రుణాలన్నీ అని చెబుతుంటే దీని కోసం ఇంత హంగామా అవసరమా అంటూ పలువురు మండిపడుతున్నారు. మభ్యపెట్టడానికే ఈ రుణాలు అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక కూటమి నేతలకు సైతం తలనొప్పిగా మారింది. ఈ సబ్సిడీ రుణాల వ్యవహారం ముందు మరిన్ని తలనొప్పులు తీసుకు వస్తుందని కూటమి నేతలే తలలు పట్టుకుంటున్నారు.

నరసన్న సన్నిధిలో అమలాపురం ఆర్డీఓ



అంతర్వేదిలో లక్ష్మీనృసింహ స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఆర్డీఓ మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయంలో బుధవారం అమలాపురం ఆర్డీఓ కొత్త మాధవి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆర్డీఓకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఆర్డీఓకు అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఆర్డీఓకు స్వామి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. కాగా దేవస్థానానికి సంబంధించిన భూములు గురించి, రైతుల నుంచి రావాల్సిన బకాయిలు గురించి ఆర్డీఓ, ఏసీ సత్యనారాయణతో సమీక్షించారు. బకాయిలు వసూలుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్డీఓ, ఆయనతో చర్చించారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని శంకర్ థియేటర్‌ను ఆర్డీఓ మాధవి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ స్టాల్స్‌లో విక్రయిస్తున్న తినుబండారాలను ఆమె పరిశీలించారు. వాటి నాణ్యతలపై ఆమె ఆరా తీశారు. ఆమె వెంట తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు సీహెచ్.భాస్కర్, ఆర్ఐ వి.రామరాజు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

అయినవిల్లి: గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా సిరిపల్లి, విలస, మాగం, కె.జగన్నాథపురం, నేదునూరు, తొత్తరమూడి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

పీహెచ్‌సీలను సందర్శించిన జిల్లా అధికారి



సఖినేటిపల్లి పీహెచ్‌సీలో వైద్యులకు మలేరియా పరీక్షలపై సూచనలిస్తున్న వెంకటేశ్వరరావు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి పీహెచ్‌సీలను బుధవారం జిల్లా మలేరియా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు సందర్శించారు. సీజనల్ జ్వరాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. జ్వరం సోకిన ప్రతి రోగికి మలేరియా పరీక్ష చేయాలన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు పీహెచ్‌సీలలో ల్యాబ్‌లను పరిశీలించి, ల్యాబ్ టెక్నీషియన్‌లకు తగు సూచనలు ఆయన చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.జె.గాయత్రి, సీహెచ్ దుర్గా కావ్య, ఎం.రాజశేఖర్, సబ్ యూనిట్ అధికారి టి.విజయ్, సిబ్బంది పీఎల్ఎన్ స్వామి, ఏ సరస్వతి, పి.బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



అంబాజీపేటలో టైలరింగ్ షాపు వద్ద శిక్షణ ప్రారంభిస్తున్న భీమారావు

అంబాజీపేట: ప్రతి విద్యార్థి వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం వల్ల ఆర్థిక పురోభివృద్ధి చెందవచ్చని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.కె.భీమారావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఒకేషనల్ కోర్స్‌లో భాగంగా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఈ ఏడాది ఒకేషనల్ కోర్స్‌లో భాగంగా గత నెల 29న జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పరీక్షల్లో 89 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరికి 12 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నామన్నారు. ఒకేషనల్ ట్రైనర్స్ జి.తేజస్విని, వై.స్టీఫెన్‌ల పర్యవేక్షణలో స్థానికంగా ఉన్న ఎలక్ట్రికల్ రివైండింగ్, టైలరింగ్ షాపులలో శిక్షణ ఇస్తామన్నారు.

13, 14 తేదీల్లో నృసింహుని దీక్షా మాలధారణ



అంతర్వేది దేవస్థానం కార్యాలయంలో మీడియాకు వివరిస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహా స్వామివారి ఆలయంలో ఈ నెల 13, 14 తేదీల్లో నృసింహ భక్తులకు స్వామివారి స్వాతి నక్షత్ర దీక్షాధారణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం దేవస్థానం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నక్షత్ర దీక్షామాలాదారణ(27 రోజులు) చేయు భక్తులు తరలి వచ్చి, దీక్షామాలాదారణ చేపట్టి, అభీష్టాలు నెరవేర్చుకోవాలని ఆయన కోరారు. కాగా దీక్షా విరమణ కార్యక్రమాన్ని వచ్చే నెల 11వ తేదీన (నృసింహ జయంతి) నిర్వహిస్తామని స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు అన్నారు. అర్చకుడు రాజేష్ పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ



పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పిస్తున్న బొజ్జిరాజు, భీమారావు

అయినవిల్లి: చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారీ చేయడంపై డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు, ఎంపీడీఓ జి.భీమరావు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఎస్.మూలపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జిరాజు, భీమారావు చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పి.గన్నవరం, అయినవిల్లి, అంబాజీపేట మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్స్‌కు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్లలో సేకరించిన తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలి? తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మి కంపోస్ట్ తయారుచేయడంపై వీరికి శిక్షణనిచ్చారు. కార్యక్రమం సర్పంచ్ బొబ్బా ప్రభాత్ అధ్యక్షతన నిర్వహించారు. మండల పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీ బెహర, ఎస్.మూలపాలెం పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

మండపేట: విద్యార్థులు బాగా చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం సూచించారు. గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియెట్ సెంకడియర్ విద్యార్థినులకు బుధవారం స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం ముంగర వెంకట్రాజు అధ్యక్షతన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందించారు. 27 మందికి కిట్లు పంపిణీ చేసినట్టు వెంకట్రాజు తెలిపారు.

సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేమా

రాజోలు: సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. బుధవారం రాజోలులో బీజేపీ విస్తృత స్థాయి సమావేశం కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా వేమా మాట్లాడుతూ అనేక నూతన సంస్కరణలతో ప్రధాని మోదీ పాలన సాగుతుందన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కిషాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ కుమార్, వల్లభనేని రవీంద్రబాబు ముఖ్యవక్తలుగా మాట్లాడుతున్నారు. టీడీపీ, బీజేపీ పొత్తు ధర్మాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, దొడ్డా నాగబాబు, చంపాటి శివరామకృష్ణంరాజు, చెల్లింగి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

మండపేట: స్థానిక సత్యశ్రీ రోడ్డులో మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా మహిళలు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని 28, 29, 30 వార్డుల మహిళలు, ప్రజలు బుధవారం దీక్ష చేసి నిరసన తెలిపారు. కాగా ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతోనే ఈ దుస్థితి వచ్చిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

ఉప్పలగుప్తం: సరిపల్లిలోని తామరచెరువుపేటలో ఆల్ ఇండియా ఓఎన్జీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, రాజమండ్రి వారి ఆర్థిక సహకారంతో సర్పంచ్ గెడ్డం స్వరూపరాణి ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు బుధవారం కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కొమ్ము సత్యనారాయణ ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గెడ్డం సురేష్‌బాబు, రవీంద్ర, ఎస్.రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు కలెక్టర్ అభినందనలు



అమలాపురంలో కొత్తపేట జట్టును అభినందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆలమూరు: జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కొత్తపేట జట్టుకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అభినందించారు. గత నెల రోజులుగా డ్రీమ్స్ 2025 స్పోర్ట్స్ పేరిట రెవెన్యూశాఖ నిర్వహించిన ఈ పోటీల్లో అమలాపురం, కొత్తపేట జట్లు ఫైనల్‌కు చేరాయి. మంగళవారం జరిగిన హోరాహోరీ ఫైనల్ పోటీల్లో కొత్తపేట జట్టు విజయం సాధించింది. ఆ జట్టుకు కెప్టెన్‌గా పని చేసిన పినపళ్ల గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.ధర్మాజీ మ్యాన్ ఆఫ్ మ్యాచ్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ది సీరిస్ దక్కించుకున్నారు.ఈ జట్టును కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీడీఓ ఏ రాజు, పంచాయతీ రాజ్ ఈఈ రాజ్‌కుమార్, జేఈ డి.వీరభద్రరావు, సర్పంచ్ సంగిత సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



జొన్నాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అంగన్‌వాడీలు

ఆలమూరు: పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పౌష్టికాహార పక్షోత్సవాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జొన్నాడలో సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ గజలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఈనెల 8న ప్రారంభమైన పక్షోత్సవాలను 22వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. అనంతరం పౌష్టికాహార వారోత్సవాల ఆవశ్యకతను వివరిస్తూ అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు.

ఆలమూరు: నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని పెదపళ్ల, చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్ హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పీసీవీ, పెంటావాలెంట్, ఎంఆర్, హైపటైటీస్ బీ వ్యాక్సిన్లను అందజేశారు.

గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు



పెదపళ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీకాంత్, డి.సాయి కిషోర్ అన్నారు. పీఎంఎంఎస్‌ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీల్లో బుధవారం నిర్వహించిన పీఎంఎంఎస్‌ఏలో సుమారు 114 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిది లేక పదో తేదీన బాలింతలు, గర్భిణులకు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. సీహెచ్ఓ ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

వైభవంగా సత్యలింగేశ్వరుని కల్యాణం



పెదపట్నంలంకలో సత్యలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలో కొలువు తీరిన ఉమా సత్యలింగేశ్వరస్వామి కల్యాణం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సత్యలింగేశ్వరుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన మంటపంలో ఉమాదేవితో సత్యలింగేశ్వరుని కొలువు తీర్చారు. బ్రహ్మశ్రీ ఆదిరాజు రఘునాథశర్మ, సూర్యకుమారి దంపతులు కర్తలుగా పాల్గొని స్వామివారి కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. బి.దొడ్డవరం గ్రామంలో వేంచేసి ఉన్న ఉమా సోమేశ్వరస్వామి, పాశర్లపూడిలోని ఉమా చెన్నమల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం కూడా రమణీయంగా జరిగింది. భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సర్వేల్లో అయినవిల్లి మండలం ముందంజలో ఉండాలి

అయినవిల్లి: సర్వేలలో ముందంజలో ఉండాలని అందకు పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎంపీడీఓ జి.భీమారావు అదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.భీమరావు పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. హౌస్‌హోల్డ్ సర్వే, వర్క్ ఫం హోమ్ సర్వేలను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాల జారీ చేశారు. ఇప్పటి వరకూ మండలంలో 15873 కుటుంబాల్లో 34863 మంది వర్క్ ఫం హోమ్ ద్వారా పనులు చేస్తున్నట్టు గుర్తించారు. వీరిలో 33398 మంది ఎక్కడ పని చేస్తున్నారో సర్వేలో వివరాలు సేకరించామన్నారు. మిగిలిన 1465 మంది వివరాలను సేకరించాలన్నారు. అలాగే హౌస్ హోల్డ్ 22714 మంది 20478 మందిని సర్వే చేసినట్లు తెలిపారు. మిగిలింది 142 మంది సర్వే చేయాలన్నారు. ఈ సర్వేలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన బాబీ



బాబిని సత్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చిట్టిబాబు

పి.గన్నవరం: ఆంధ్రప్రదేశ్ ఆన్ రిగగ్నైజ్డ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అమలాపురానికి చెందిన వంటెద్దు బాబి నియమితులయ్యారు. ఆయన కాంగ్రెస్ కోనసీమ జిల్లా కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబును బుధవారం నగరంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బాబిని చిట్టిబాబు ఘనంగా సన్మానించారు. కొత్త వారిని పార్టీలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, అమలాపురం రూరల్ అధ్యక్షులు ఏలేశ్వరపు రాధాకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మొల్లేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ముమ్మిడివరం: కొత్తలంక గ్రామానికి చెందిన ఒక మహిళ మంగళవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామానికి చెందిన పసుపులేటి కృష్ణవేణి (45) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని ఆమె కుమారుడు వీర హరి తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముమ్మిడివరం స్టేషన్ హెచ్ఓ జి.భైరవ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సెల్. 9849918933కు సమాచారం ఇవ్వాలని ఆమే కుటుంబ సభ్యులు కోరుతున్నారు.